https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 314 శనివారం 31-1-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా

రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో

పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# వనమంతా జనమై..







మేడారానికి అనూహ్యంగా పోటెత్తిన భక్తులు..

క్యూలైన్ల వద్ద అదుపు తప్పిన పరిస్థితి

రద్దీ నియంత్రణకు

లాఠీలకు పనిచెప్పిన పోలీసులు

వీఐపీల తాకిడి పెరగడంతో ఇబ్బందిపడ్డ భక్తులు

జనజాతరను తలపించిన

బస్టాండ్ ప్రాంగణం

మేడారం, జనవరి 30

సాధారణంగా మేడారం మహాజాతరలో ఎప్పుడూ రెండోరోజే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సమ్మక్క గద్దె చేరిన 24 గంటల తర్వాత జాతర పలుచబడుతుంది. ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. మూడోరోజు భక్తులు వరదలా పోటెత్తారు. ఫలితంగా శుక్రవారం జాతరలో పరిస్థితి ఒక్కసారిగా అదుపు తప్పింది. జాతర ప్రాంగణమంతా అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది. జంపన్నవాగు, బస్టాండ్ ప్రాంగణం ఇలా ఎక్కడ చూసినా ఇసుకేస్తే రాలనంతగా భక్తజనం కనిపించారు. ప్రత్యేకించి క్యూలైన్ల వద్ద భక్తులను నియంత్రించడం పోలీసులకు సవాలుగా పరిణమించింది. గద్దెల వద్ద వెళ్లే అన్ని ప్రధాన ద్వారాల వద్ద భక్తులు కిక్కిరిసిపోవడంతో లోపలివారు బయటకు రాలేని పరిస్థితి.. అలాగే బయటి వారు లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇది తొక్కిసలాటకు దారితీసింది. మహిళలు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లైన్లలో ఊపిరాడక చిన్నారులు గుక్కపెట్టి ఏడ్చారు. ఓ చిన్నారి స్పృహ తప్పి పడిపోయింది. క్యూలైన్‌లో నిల్చున్నవారికి తాగేందుకు నీళ్లు లేక వారి గొంతులు దప్పికతో తడారిపోయాయి. కొందరు అస్వస్థతకు గురయ్యారు.

## కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు?

విచారణ పేరుతో కాలయాపన

బీఆర్ఎస్ మునిగిపోతున్న నావ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్



జగిత్యాల, జనవరి 30

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రభుత్వాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు ప్రశ్నించారు. నోటీసులు, విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నార ని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారిఒప్పందం చేసుకొని ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. శుక్రవారం రాత్రి జగిత్యాలలోని మునిసిపల్ టౌన్ హాలులో నిర్వహించిన బీజేపీ విజయ శంఖారావ సంకల్ప సభలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మునిగిపోతున్న నావ లాంటిదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కేసీఆర్‌కు జైలుకు పంపుతానని, కేసీఆర్‌కు జైలులో డబుల్ బెడ్ రూంను కట్టిస్తానని చె ప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. కనీసం ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించలేదని ఎద్దేవా చేశారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు అరెస్టు చేయడం లేదని నిలదీశారు. రాష్ట్రానికి ద్రోహం చేసినవారు పోల?సస్టేషన్ల చుట్టూ తిరుగుతూ గల్లాలు ఎగరేవేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీ అబద్ధమేనని రాంచందర్‌రావు విమర్శించారు. రూ.4 వేల నిరుద్యోగ భృతి, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ అవకాశాలు, రైతుభరోసా ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ నైజం అని ధ్వజమెత్తారు. బొగ్గు కుంభకోణంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండింటికీ పాత్ర ఉందని ఆరోపించారు. తెలంగాణను రక్షించాలంటే మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి చీము నెత్తురు ఉంటే కేసీఆర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చుడు, డబ్బు సంచులు తీసుకునుడు అలవాటుగా మారిందని ఆరోపించారు.

## పెళ్లి చేసుకుంటానని ఒకరు.. అనుమానంతో మరొకరు

వేధింపులతో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

వరంగల్ జిల్లాలో ఘటన, ఆరుగురిపై కేసు నమోదు



పర్వతగిరి, జనవరి 30

పెళ్లి చేసుకుంటానని ఒకరు, అనుమానంతో మరొకరు వేధించడంతో వరంగల్ జిల్లాలో ఓ మహిళా కానిస్టేబుల్ బలవన్మరణానికి పాల్పడింది. పర్వతగిరి మండలంలోని సీత్యాతండాకు చెందిన రమావత్ అనిత (26) వరంగల్ కమిషనరేట్‌లోని ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఆమెతో వైజాగ్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని కొమ్మనపల్లి తండాకు చెందిన గుగులోత్ రాజేందర్ పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ప్రేమ పేరుతో కొన్నేళ్లుగా వేధించడం మొదలు పెట్టాడు. ఆమె డ్యూటీలో ఉండగా వీడియో కాల్స్ చేయాలంటూ ఒత్తిడి చేసే వాడని, వేరే ఎవరితోనూ మాట్లాడొద్దని షరతులు పెట్టేవాడని సమాచారం. రాజేందర్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో అతనితో వివాహానికి నిరాకరించిన అనిత తల్లిదండ్రులు.. జవహర్‌లాల్ అనే మరోవ్యక్తితో అనితకు పెళ్లి కుదిర్చారు. తనను కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంటుందనే కోపంతో రాజేందర్.. జవహర్‌లాల్‌కు అనితపై లేనిపోనివి కల్పించి చెప్పి రెచ్చగొట్టాడు. వారిద్దరూ కలిసి దిగిన ఫొటోలను కూడా వాట్స?స?పలో పంపించాడు. దీంతో జవహర్‌లాల్ సైతం అనితను వేధించడం ప్రారంభించాడు. ఇద్దరి వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురైన అనిత.. రాజేందర్‌కు ఫోన్ చేసి తమ ఇద్దరి మూలంగానే తన జీవితం నాశనమైందని, ఇక చావే తనకు దిక్కని కన్నీరు పెట్టింది. దిక్కున్న చోట చెప్పుకోమని, చస్తే చావని రాజేందర్ చెప్పడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 27న పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 29న మృతి చెందింది.

## హైదరాబాద్‌లోనే విచారణ!

### ఎర్రవల్లికి పోలీసులు రావడం కుదరదు

ఎర్రవల్లిలో కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ



హైదరాబాద్, జనవరి 30

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లోనే విచారణకు రావాలని సిట్ స్పష్టం చేసింది. ఈ కేసులో విచారణ హైదరాబాద్‌లోనే జరుగుతోందని, కేసు హైదరాబాద్ పరిధిలోదని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో ఆయన్ను ఎర్రవల్లి ఫామ్‌హచి?స లో విచారించడం కుదరదని తేల్చిచెప్పింది. ఫిబ్రవరి ఒకటిన ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆయన్ను విచారిస్తామని తెలిపింది. బంజారాహిల్స్ నందినగర్ ఇంట్లో కానీ, జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో కానీ అందుబాటులో ఉండాలని బీఆర్ఎస్ అధినేతను కోరింది. రెండింటిలో ఎక్కడ అందుబాటులో ఉంటారో తమకు సమాచారం ఇవ్వాలంటూ కేసీఆర్‌కు మరోసారి నోటీసులు జారీ చేసింది. శుక్రవారం రాత్రి 9 గంటలకు సిట్ బృందం నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లి అక్కడి సిబ్బందికి నోటీసులు అందించే ప్రయత్నం చేశారు. అయితే సిబ్బంది ఎవరూ అందుబాటులోకి రాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటి గోడకు నోటీసును అంటించారు. "పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో 2024లో క్రైం నె ంబర్ 243 కింద నమోదైన కేసు విచారణలో భాగంగా మీకు అందచేసిన నోటీసుకు మీరు పంపించిన జవాబు పరిశీలించాం. ఎన్నికల అఫిడవిట్‌లోనూ, అసెంబ్లీ కార్యాలయం రికార్డుల్లోనూ గజ్వేల్ ఎమ్మెల్యేగా మీరు పేర్కొన్న నందినగర్ ఇంటి చిరునామాకే నోటీసు పంపించాం. మీరు ఎర్రవెల్లికి రమ్మని కోరినప్పటికీఅది సాధ్యం కాదు. కేసు విచారణ పరిధి దృష్ట్యా మీరు అధికారికంగా రికార్డుల్లో పేర్కొన్న నందినగర్ నివాసంలోనే విచారిస్తాం" అని నోటీసులో పేర్కొన్నారు. చట్టపరంగా అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే ఈ నోటీసు జారీ చేస్తున్నామని తెలిపారు. కేసు విచారణలో అనేక ముఖ్యమైన ఎలక్ష?ట్రనిక్ ఆధారాలు, రికార్డులు ఉన్నాయని, ఇందులోని అత్యంత ముఖ్యమైన సమాచారం ఉందని, వీటిని తీసుకుని ఎర్రవెల్లికి రావడం సాధ్యం కాదని చెప్పారు. నందినగర్ నివాసంలోనే విచారణకు సిద్ధంగా ఉండాలని సిట్‌కు నేతృత్వం వహిస్తున్న ఏసీపీ వెంకటగిరి సూచించారు. సిట్ జారీ చేసిన నోటీసుపై కేసీఆర్ స్పందిస్తూ, తాను ప్రస్తుతం నందినగర్ నివాసంలో ఉండటం లేదని, ఎర్రవెల్లిలో ఉంటున్నానని తెలిపారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 160 కింద సాక్షిగా విచారణకు రమ్మని సిట్ పంపిన నోటీసులో హైదరాబాద్‌లో తను కోరుకున్న చోట విచారణకు రమ్మని పేర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ కేసీఆర్ గురువారం సిట్ చీఫ్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం తాను నివసిస్తున్న ఎర్రవెల్లిలోనే విచారించాలని అందులో కోరారు. ఈ లేఖపై సిట్ అధికారులు శుక్రవారం న్యాయ సలహా తీసుకున్నారు. మరో నోటీసు జారీ చేయాలని నిర్ణయించారు.

## నెలసరి ఆరోగ్యం ప్రాథమిక హక్కు

అది రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు, విద్యాహక్కులో భాగమే

- పాఠశాలల్లో బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించాలి
- బడిలో ఆడ, మగపిల్లలకు వేర్వేరు మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి
- నెలసరి సమయంలో, యవ్వన దశలో వచ్చే ఆరోగ్యపర మార్పులపై అవగాహనకల్పించే పాఠాలను బోధించాలి
- పురుష టీచర్లు, విద్యార్థులను సైతం చైతన్యవంతులను చేయాలి
- 3 నెలల్లోగా ఈ ఆదేశాలను అన్ని స్కూళ్లల్లో అమలు చేయాలి: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 30

రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు, విద్యాహక్కులో భాగంగా.. నెలసరి సమయంలో ఆరోగ్యంగా ఉండడం (రుతుక్రమ ఆరోగ్యం) మహిళల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆరు నుంచి 12వ తరగతి వరకూ చదివే కౌమార దశలోని బాలికల కోసం కేంద్రం రూపొందించిన 'పాఠశాలలకు వెళ్లే బాలికల కోసం రుతుక్రమ పారిశుధ్య విధానా'న్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సూచించింది. అందులో భాగంగా.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మగ పిల్లలకు, ఆడ పిల్లలకు వేరువేరుగా శౌచాలయాలను ఏర్పాటు చేయాలని, వాటిలో ఉపయోగించడానికి వీలయ్యే నీటి కనెక్షన్ ఉండేలా చూడాలని, విద్యార్థినులకు పర్యావరణ హిత శానిటరీ న్యాప్‌కిన్స్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచాలని దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ తీర్పును అమలు చేయకపోతే ప్రైవేటు స్కూళ్ల గుర్తింపును రద్దుచేయాలని.. ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేయకపోతే అందుకు నేరుగా రాష్ట్రప్రభుత్వాలను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించాలని, కనీస పారిశుధ్య సౌకర్యాలు ఏర్పాటయ్యేలా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఈ తీర్పును వెలువరించింది. "ఒక పీరియడ్ (ఫుల్‌స్టాప్) వాక్యాన్ని ముగించాలి తప్ప.. బాలికల విద్యను కాదు" అన్న అమెరికన్ విద్యావేత్త, సామాజిక కార్యకర్త మెలిస్సా బెర్టన్ హృద్యమైన వ్యాఖ్యను ఉటంకిస్తూ జస్టిస్ జేబీ పార్దీవాలా 126 పేజీల తీర్పును ప్రారంభించారు. "రాజ్యాంగంలోని 21వ అధికరణం కింద కల్పించన జీవించేహక్కులో రుతుక్రమ ఆరోగ్యం కూడా ఒక భాగమే. ఒక బాలిక అత్యున్నతమైన లైంగిక,



పునరుత్పత్తి ఆరోగ్యాన్ని సాధించడానికి.. సురక్షితమైన, ప్రభావవంతమైన, అందుబాటు ధరల్లో ఉండే నెలసరి ఆరోగ్య నిర్వహణ చర్యలు ఉపయోగపడతాయి. ఆరోగ్యకరమైన పునరుత్పత్తి జీవితాన్ని గడిపేహక్కులో భాగంగా.. లైంగిక ఆరోగ్యాన్ని గురించి తెలుసుకునే హక్కు, దానికి సంబంధించిన చదువును పొందే హక్కు కూడా ఉంటుంది" అని ఆయన తన తీర్పులో పేర్కొన్నారు.

## కుక్కకైనా టికెట్ ఇస్తా కానీ

# నీకు ఇవ్వను!

**దుబ్బాక బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడికి చేదు అనుభవం..**

**మాజీ చైర్‌పర్సన్ వ్యాఖ్యలతో మనస్తాపం.. పార్టీకి రాజీనామా**

**రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ప్రత్యర్థులుగా తండ్రీ కొడుకులు**



**దుబ్బాక, జనవరి 30**

మునిసిపల్ ఎన్నికల వేళ దుబ్బాక బీఆర్ఎస్ పార్టీలో వర్గ విభేదాలు రచ్చకెక్కాయి. 'కుక్కకు టికెట్ ఇచ్చి గెలిపించుకుంటా..నీకు మాత్రం ఇవ్వను' అంటూ మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితారెడ్డి తనను దూషించారంటూ దుబ్బాక బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వంశీ కృష్ణగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె వ్యాఖ్యలతో మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటించారు. దుబ్బాక 18వ వార్డు బీసీ జనరల్‌కు రిజర్వు అవ్వగా.. ఆ స్థానంలో తన భార్యను బరిలోకి దించాలని వంశీకృష్ణ గౌడ్ భావించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి టికెట్ కోరగా.. మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితారెడ్డిని ఒప్పించుకోవాలని సూచించినట్టు సమాచారం. అయితే, వంశీకృష్ణ గౌడ్ సతీమణిని కాకుండా వనితారెడ్డి మరొకరిని బరిలో నిలిపారు. విషయం హరీశ్‌రావు చెంతకు చేరగా టికెట్ల కేటాయింపులో కార్యకర్తలకు ప్రాధాన్యమివ్వండంటూ ఆయన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు సూచించారు. దీంతో బక్కి వెంకటయ్య మరోసారి వనితారెడ్డిని కలవమని వంశీకృష్ణ గౌడ్‌కు సూచన చేశారు. దీంతో వంశీకృష్ణగౌడ్ వనితారెడ్డిని కలిశారు. అయితే, ఆమె.. కుక్కకు టికెట్ ఇచ్చి గెలిపించుకుంటా కానీ నీకు మాత్రం ఇవ్వనని చెప్పారని వంశీకృష్ణగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మునిసిపాలిటీలో తండ్రీకొడుకులు ఒకరిపై ఒకరు పోటీకి దిగారు. 12వ వార్డులో బీఆర్ఎస్ నుంచి దండు సంతోష్ కుమార్ 2రోజుల క్రితం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తండ్రి దండు రాజేశ్వర్ శుక్రవారం కాంగ్రెస్ నుంచి అదే వార్డుకు నామినేషన్ వేశారు. సంతోష్ శుక్రవారం మరో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. భువనగిరి మునిసిపాలిటీలోని 32వ వార్డుకు బాలింత బర్రె సంఘవి పసిపాపతో వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కాగా, కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వలేదనే మనస్తాపంతో నల్లగొండ జిల్లా చండూరులో 9వ వార్డుకు చెందిన కార్యకర్త భూతరాజు వేణు పురుగు మందు తాగగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

## బాబ్బాబూ ఉపసంహరించుకోవూ!

**రెబెల్స్‌ను బుజ్జగించే పనిలో ప్రధాన పార్టీలు..**

**ఉపసంహరింపజేశాకే బీ ఫారాల పంపిణీ**

**నామినేషన్లు వెనక్కి తీసుకునేందుకు 3 దాకా గడువు**

**హైదరాబాద్, జనవరి 30**

మునిసిపల్ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక బుజ్జగింపుల పర్వం మొదలైంది. ఇప్పటి దాకా ప్రధాన పార్టీలు అభ్యర్థులకు బీ ఫారాలు ఇవ్వలేదు. పార్టీ అధ్యక్షులు.. బీ ఫారం, ఏ ఫారంలపై సంతకాలు చేసి క్షేత్రస్థాయిలో బాధ్యులకు పంపారు. నామినేషన్ల ఉపసంహరణ కోసం 3వ తేదీ వరకు గుడువు ఉండటంతో ఆయా పార్టీల నాయకత్వం తిరుగుబాటు అభ్యర్థులను బుజ్జగించే పనిలో పడింది. రెబెల్స్ చేత నామినేషన్లు ఉపసంహరింపజేశాక ముందే నిర్ణయించిన అభ్యర్థులకు బీ ఫారాలు ఇవ్వనున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఈ తిరుగుబాట్ల బెడద ఎక్కువగా ఉంది. మునిసిపల్ ఎన్నికల్లో అభ్యర్థిత్వాలకు సంబంధించి మొదటి నుంచీ కాంగట?స్రలో ఉన్న నేతలకు, అసెంబ్లీ ఎన్నికల ముందు, ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి కాంగటస్రలో చేరిన నాయకులకు మధ్య పోటీ నడుస్తోంది. బీఆర్ఎస్ నుంచి కాంగట?స్రలో చేరిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. పంచాయతీ ఎన్నికల సందర్భంగానూ తిరుగుబాటు అభ్యర్థుల బెడదను కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంది. మునిసిపల్ ఎన్నికల్లో ఈ సమస్యను పరిగణనలోకి తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమించి.. పరిష్కార బాధ్యతలూ వారికి అప్పగించారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డులు/డివిజన్లు అభ్యర్థుల ఎంపిక బాధ్యతనూ ఇన్‌చార్జి మంత్రులపైనే పెట్టారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించి కొద్ది రోజులుగా మంత్రులు.. ఆయా నియోజకవర్గాల్లో సమీక్షలు నిర్వహిస్తున్నారు. నామినేషన్ల పర్వం ముగిసేటప్పటికి సాధ్యమైనంతవరకు తిరుగుబాటు అభ్యర్థుల బెడద లేకుండా పరిష్కరించారు. అయినా అనేక చోట్ల ఒక డివిజన్/వార్డుకు ఇద్దరు, ముగ్గురు కాంగ్రెస్ నేతలు నామినేషన్లు దాఖలు చేసినట్లు చెబుతున్నారు. స్క్రీనింగ్ కమిటీల సభ్యులు ఆయా నాయకులతో ప్రస్తుతం చర్చలు జరుపుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం.. మునిసిపల్ ఎన్నికల్లో పార్టీని గెలిపించే బాధ్యతను పూర్తిగా స్థానిక నాయకత్వానికి అప్పగించేసింది.

# కత్తి చంద్రబాబుది.. పొడిచేది రేవంత్‌రెడ్డి!

**ఢిల్లీ సాక్షిగా రాష్ట్రానికి జల ద్రోహం**

**200 టీఎంసీల గోదావరి నీటిని ఏపీకి తరలించే కుట్ర**

**రేవంత్ సర్కారు రాష్ట్రానికి మరణ శాసనం రాయబోతోంది**

**రాష్ట్రానికి అన్యాయం చేస్తే కేసీఆర్ ఆధ్వర్యంలో జలపోరాటం: హరీశ్**



**హైదరాబాద్, జనవరి 30**

ఢిల్లీ సాక్షిగా తెలంగాణకు జలద్రోహం చేయడానికి సిద్ధమవుతున్నారని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు అన్నారు. 200 టీఎంసీల గోదావరి జలాలను ఏపీకి తరలించే కుట్ర జరుగుతోందని, ఢిల్లీలో నిర్వహించిన జలవివాదాల కమిటీ సమావేశం పోలవరం-నల్లమలసాగర్‌కు పరిష్కారం కోసమేనని ఆరోపించారు. జలద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుదైతే, పొడిచేది రేవంత్‌రెడ్డి అని చెప్పారు. గోదావరి నదీ జలాల అక్రమ తరలింపు విషయంలో బీఆర్ఎస్ మొదటి నుంచీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తూ వస్తోందన్నారు. బనకచర్ల అయినా, నల్లమలసాగరైనా మారింది పేరు మాత్రమేనని, ఏపీ జలదోపిడీ ఆగలేదని అన్నారు. ఢిల్లీలో జరిగిన తెలుగు రాష్ట్రాల సాగునీటి సమావేశం సాక్షిగా రేవంత్ ప్రభుత్వం మరణశాసనం రాయబోతోందని, నల్లమలసాగర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తోందని ఆరోపించారు. తాను ప్రశ్నించిన తర్వాతే ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నామంటూ రెండు షరతులు పెట్టి తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని చెప్పారు. నల్లమలసాగర్‌కు డీపీఆర్ ఆపాలని, ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇవ్వొద్దన్న షరతులు విధించారని తెలిపారు. వీటికి కేంద్రం ఎలాంటి హామీ ఇవ్వకుండానే ఢిల్లీ సమావేశానికి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. నల్లమలసాగర్‌కు అగీకారం తెలిపి, తెలంగాణకు మరణశాసనం రాయాలని అనుకుంటున్నారా? అని నిలదీశారు. చంద్రబాబు ఒత్తిడితో ఢిల్లీలో జరుగుతున్న ఈ సమావేశాన్ని రాష్ట్రం బహిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులను అడుగడుగునా వ్యతిరేకించిన వ్యక్తిని సమావేశానికి పంపడమంటే తెలంగాణకు ద్రోహం చేయడానికే కదా? అని నిలదీశారు. ఇదే ఆదిత్యనాథ్ గతంలో కాళేశ్వరం, గోదావరి, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు, తుపాకులగూడెం, మిషన్ భగీరథ, చనాక కొరాటా, రామప్ప డైవర్షన్‌లు అక్రమ ప్రాజెక్టులని.. వాటిని నిలిపివేయాలని చెప్పారని గుర్తుచేశారు.

### మొదటి నుంచి రేవంత్ మద్దతు!

గోదావరి జలాలను ఏపీ అక్రమంగా తరలించుకువెళ్లేలా పోలవరం, నల్లమలసాగర్‌కు రేవంత్‌రెడ్డి పథకం ప్రకారమే సహకరిస్తున్నారని హరీశ్ ఆరోపించారు. వెళ్లనని చెబుతూనే రేవంత్‌రెడ్డి ఢిల్లీ సమావేశానికి వెళ్లారని, సంతకం చేసి తెలంగాణ నదీ జలాల హక్కులను కాలరాశారని, వేయనంటూనే కమిటీ వేసి ఏపీ జల దోపిడీకి ఎర్ర తివాచీ పరిచారని విమర్శించారు. టెండర్ గడువు ముగిశాక సుప్రీంకోర్టుకు వెళ్లి నల్లమలసాగర్‌కు పరోక్షంగా అంగీకారం తెలిపారన్నారు. చివరకు పిటిషన్ వాపస్ తీసుకున్నారని చెప్పారు. ఢిల్లీకి, దావో?సకు తిరగడం తప్ప పాలనపై దృష్టిపెట్టని రేవంత్ తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోరని, సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ అయినా పట్టించుకొని రాష్ట్రానికి నష్టం కలగకుండా చూడాలని కోరారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ రాష్ట్రానికి జరుగతున్న జల ద్రోహాన్ని గుర్తించి, తక్షణం అడ్డుకోవాలని చెప్పారు. నీటి హక్కుల సాధన కోసం కేసీఆర్ ఆధ్వర్యంలో మరో పోరాటం చేస్తామని హరీశ్ హెచ్చరించారు.

### మునిసిపాలిటీలపై ఎగిరేది గులాబీ జెండానే: హరీశ్‌రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లోనే కాదు, ఆ పార్టీ సొంత నాయకుల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొందని హరీశ్ అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని అన్ని మునిసిపాలిటీలపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని చెప్పారు. కాంగ్రెస్ నేత సుప్రభాత్‌రావు, తదితరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం వారికి హరీశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. .

# చుక్క నీటినీ వదులుకోం

**మేం వచ్చాకే కృష్ణా, గోదావరిలో నీటి హక్కుల కోసం పోరాడుతున్నాం**

**విందుల కోసం తెలంగాణ ప్రయోజనాలను కేసీఆర్ తాకట్టు పెట్టారు**

**పోలవరం-నల్లమల సాగర్‌ను అన్ని వేదికలపైనా వ్యతిరేకిస్తున్నాం: ఉత్తమ్**



**హైదరాబాద్, జనవరి 30:**

కృష్ణా, గోదావరి జలాల్లో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. విందుల కోసం కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నీళ్లు, నిధులు, నియామకాల కోసమని, కానీ.. పదేళ్లపాటు తెలంగాణను బీఆర్ఎస్ నిలువు దోపిడీ చేసిందని ధ్వజమెత్తారు. పదేళ్ల బడ్జెట్లలో మొత్తం రూ.17 లక్షల కోట్లు వెచ్చిస్తే.. అందులో నీటి పారుదల ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు వెచ్చించారని, కానీ.. రూ.లక్ష కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారు అధికారంలో ఉండగానే కుప్పకూలిందని అన్నారు. ఆ ప్రాజెక్టులో లక్ష ఎకరాలు కూడా సాగులోకి రాలేదన్నారు. శుక్రవారం మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నామని, బీఆర్ఎస్ చేసిన పొరపాట్లను సరిచేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీల నీటిని కేటాయిస్తే.. రాష్ట్రం ఏర్పడ్డాక అందులో 512 టీఎంసీలను ఏపీకి రాసిచ్చి, తెలంగాణకు 299 టీఎంసీలు చాలునంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం సంతకాలు చేయలేదా? అని ప్రశ్నించారు. అప్పుడు సీఎంగా కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావే ఉన్నారని ఉత్తమ్ గుర్తు చేశారు. కృష్ణా జలాల్లో 70 శాతం వాటా కావాలని కోరుతున్నామని, జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌లో పోరాడుతు న్నామని తెలిపారు. "కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఏపీ సీఎం జగన్‌కు విందులు ఇచ్చి.. గోదావరి జలాలను తెలంగాణ నుంచి తీసుకెళ్లి రాయల సీమను రతనాల సీమ చేస్తామని ప్రకటిం చలేదా? రోజా ఇంటికి వెళ్లి మాట్లాడిన మా టలు తెలంగాణ సమాజం మర్చిపోతుం దను కుంటున్నారా?" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

### నల్లమల సాగర్‌కు ఏ అనుమతులూ రాలేదు..

పోలవరం-నల్లమలసాగర్/బనకచర్లను అన్ని వేదికల్లోనూ వ్యతిరేకిస్తున్నామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కేంద్ర జలవనరుల సంఘానికి, జలశక్తి శాఖకు, గోదావరి, కృష్ణా బోర్డులకు, పోలవరం ప్రాజెక్టు అథారిటీకి లేఖలు రాశామని, కేంద్రంతో జరిగిన పలు సమావేశాల్లో ఈ ప్రాజెక్టును వ్యతిరేకించామని చెప్పారు. దీనిపై సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను సీజేఐ సూచనతో వెనక్కి తీసుకొని ఒరిజనల్ సూట్ వేస్తున్నామని అన్నారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎ?ఫఆర్)పై రెండు రోజుల క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖ రాశామని, ఆ ప్రాజెక్టుకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదంటూ లేఖ ద్వారా ఆయన సమాచారం ఇచ్చారని తెలిపారు. డీపీఆర్‌కు కూడా అనుమతి ఇవ్వలేదని లేఖలో పేర్కొన్నారని చెప్పారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు పదే పదే అవాస్తవాలు, అబద్ధాలు చెప్పి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశం గురించి హరీశ్‌రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదన్నారు. పోలవరం-నల్లమలసాగర్‌ను అజెండాలో చేర్చడానికి వీల్లేదని సమావేశంలో అధికారులు చెప్పారని, అంతర్రాష్ట్ర వివాదాల వల్ల ఆగిన ప్రాజెక్టులపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని మాత్ర మే చెప్పామని మంత్రి స్పష్టం చేశారు.

### కాళేశ్వరంపై సిగ్గుపడాల్సిందిపోయి..


వారి హయాంలోనే కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి హయాంలోనే కూలినందుకు సిగ్గుపడాల్సింది పోయి.. సమర్థించుకుంటారా? అని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. ఐదేళ్ల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 160 టీఎంసీల నీటిని ఎత్తిపోశారని, కానీ.. వరదలతో నీటిని కిందికి వదిలిన తర్వాత, జలాశయాల్లో నిల్వల తర్వాత 60-70 టీఎంసీలే వినియోగించారని తెలిపారు. 60-70 టీఎంసీల నీటితో 17 లక్షల ఎకరాల ఆయకట్టు ఎలా వచ్చిందో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. దేవాదుల, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఈ రెండేళ్లలోనే కృష్ణా జలాల్లో ఎక్కువ వినియోగం జరిగిందని, ఎక్కువ పంట పండిందని, సేకరణ కూడా ఈ రెండేళ్లలోనే జరిగిందని తెలిపారు. 29 రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో ఉందన్నారు. నీటిపారుదల శాఖను బీఆర్ఎస్ దోపిడీ వ్యవస్థగా మార్చిందని ఉత్తమ్ ఆరోపించారు. పదేళ్లలో బదిలీలు, నియామకాలు కూడా జరగలేదని వెల్లడించారు. రెండేళ్లలో నియామకాలు చేశామని, శాశ్వత ప్రాతిపదికన పదోన్నతులు ఇచ్చామని చెప్పారు.

### హరీశ్‌రావు సలహాలు అక్కర్లేదు..

నీటిపారుదల ప్రాజెక్టులపై హరీశ్‌రావు సలహాలు తమకు అవసరంలేదని మంత్రి ఉత్తమ్ అన్నారు. "ఇరిగేషన్ శాఖను నాశనం చేసిన మీరు మాకు సలహాలు ఇస్తారా?" అని వ్యాఖ్యానించారు. దేశంలో అత్యంత ప్రమాదకర డ్యామ్‌లలో కాళేశ్వరం ప్రాజెక్టు ఒకటని లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. బ్యూరోక్రాట్లపై తప్పుడు ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ మానుకోవాలని హితవు పలికారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులపై నిర్ణయాలు తీసుకున్నది,

జీవోలు జారీ చే సింది ఆదిత్యనాథ్ దాస్ అని, ఆయనను తాము ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నామని తెలిపారు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ఏపీ ప్రాజెక్టులపై పనిచేసిన ఎస్కే జోషిని సలహాదారుగా నియమించుకుందని అన్నారు.

# తక్కువ వడ్డీతో లోన్ కావాలా.. ఇలా చేయండి!




జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఏడాది క్రితం రూ. 40 వేలు ఉన్న పసిడి ధర ప్రస్తుతం రూ. లక్షకు పైగా పెరిగిపోయింది. రోజురోజుకూ పెరుగుతున్న బంగారం ధరలతో పుత్తడి ప్రియులు షాక్‌కు గురవుతున్నారు. బంగారం కొందామంటే అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారతీయులు ముఖ్యంగా బంగారం అంటే చాలా విలువ ఇస్తారు. దేశంలోని మహిళలు బంగారు ఆభరణాలు ధరిస్తారు. పేదవారి నుంచి ధనికులు వరకు తమకు వీలైనంత బంగారం కొనుగోలు చేస్తారు.ముఖ్యంగా మహిళలకు సారీ ఫంక్షన్, పెళ్లి సమయంలో కట్నంగా బంగారు ఆభరణాలు అందజేస్తారు. దీంతో బంగారం వాడకం మిగితా దేశాలతో పోలిస్తే మనదేశంలోనే ఎక్కువ. ఇక డిమాండ్‌కు తగ్గట్టుగానే ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ధరల పెంపుతో ప్రతి ఒక్కరూ బంగారాన్ని ఇన్వెస్ట్ చేయడం ప్రారంభించారు. కేవలం ఆభరణంగా, పెట్టుబడిగానే కాకుండా ఆర్థిక అవసరాల్ని వేగంగా తీర్చే నగదు వనరుగా బంగారం మారడంతో తాకట్టు పెట్టడం ద్వారా కూడా లోన్లు పొందొచ్చు. గత జూన్ వరకు చూస్తే భారతీయుల దగ్గర బంగారం నిల్వలు 34,600 టన్నులకు చేరాయని.. దీని విలువ చూస్తే ఏకంగా రూ. 335 లక్షల కోట్లుగా ఉంటుందని అమెరికా ఆర్థిక సేవల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ఎక్కువ భాగం ఇంట్లోని లాకర్లలో నిరుపయోగంగా ఉంటున్నట్లు తెలిపింది. ఈ మధ్య బంగారం ధరలు పెరుగుతున్నందున గోల్డ్ ని అమ్మేందుకు బదులు లోన్ రూపంలో తీసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యత రగతి ప్రజలు గోల్డ్ లోన్ తీసుకు నేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సంస్థ తెలిపింది. ముఖ్యంగా లోన్ తీసుకునేవారు పర్సనల్ లోన్, క్రెడిట్ కార్డుల కంటే బంగారం తాకట్టు పెట్టి లోన్ పొందుతున్నారు. పర్స నల్ లోన్, క్రెడిట్ కార్డుల ద్వారా ఎక్కవ వడ్డీ పడుతుంది. అదే గోల్డ్ లోన్ తీసుకుంటే వడ్డీ తక్కువగా ఛార్జ్ చేస్తారు. అధిక వడ్డీ కంటే తక్కువ వడ్డీ పడుతున్నందున బంగా రం తాకట్టుపెట్టి లోన్ తీసుకునేం దుకు ముందుగా ఆలోచిస్తున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏంటం టే.. ఇక్కడ క్రెడిట్ స్కోర్, ఇన్ కమ్ ఉండాల్సిన పని లేదు. దీంతో బంగారంపై లోన్ కి ఎలాంటి రిస్క్ ఉండదు. బంగారం విలువను బట్టి అందులో 70-85 శాతం లోన్ ఇస్తారు. ఇక బ్యాంకులు లోన్ కూడా త్వర గానే ఇస్తారు. ఆభరణాల నాణ్య త పరిశీలించి.. బ్యాంకులు గంటల వ్యవధిలోనే లోన్ మంజూరు చేస్తా యి. ఇతర పర్సనల్ లోన్, ఎడ్యుకేషన్ లోన్, వెహికిల్ లోన్ వంటి వాటితో పోలిస్తే.. గోల్డ్ లోన్ వడ్డీ రేట్లు చాలా తక్కువగా (కనీసం 10-18 శాతం) ఉండనున్నాయి. బంగారు రుణాల చెల్లింపులపై ఈఎంఐ లేదా వడ్డీని నెలవారీగా కా కుండా 3/6 నెలలకు ఓసారి చెల్లిం చవచ్చు. అంతేకా కుండా లాస్ట్ పేమెంట్ లో అసలు చెల్లించే బుల్లెట్ పేమెంట్ ఆప్షన్ ద్వారా కూడా సెటిట్ మెంట్ చేసుకోవచ్చు.

# భారత్‌కు బడా బ్యాంకులు కావాలి




ముంబై: భారత్‌లోనూ ప్రపంచ స్థాయి పెద్ద బ్యాంకు ల అవసరం ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ), సంబంధిత బ్యాంకులతో చర్చిస్తున్నట్టు వెల్లడించారు. ఎస్‌బీఐ 12వ బ్యాంకింగ్ అండ్ ఎకనామిక్ కాంక్లేవ్- 2025 సదస్సులో ఆమె ఈ విషయం చెప్పారు. మన దేశంలో ప్రపంచ స్థాయి పెద్ద బ్యాంకుల ఏర్పాటుపై తుది నిర్ణయం తీసుకునేందుకు చాలా కసరత్తు చేయాల్సి ఉంటుందని సీతారామన్ తెలిపారు. ఇందుకు అవసరమైన సలహాలు, సూచనల కోసం ఆర్‌బీఐ, బ్యాంకులతో చర్చిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ లేదా విలీనాల ద్వారా ప్రభుత్వం ఇందుకు శ్రీకారం చుట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే ప్రపంచ స్థాయి పెద్ద బ్యాంకులను మన దే?శంలో ఏర్పాటు చేయడం ఎలా? అనే అంశాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించలేదు. దీంతో ప్రస్తుతం ఉన్న 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎసబీ)ను మరింత కుదించి ఏర్పాటు చేస్తారా? లేక వేరే మార్గమేదైనా ఆలోచిస్తారా? అనే అంశంపై స్పష్టత రావడం లేదు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) వంటి పీఎసబీల ప్రైవేటీకరణకు నీతి ఆయోగ్ నాలుగేళ్ల క్రితమే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉద్యోగ సంఘాల వ్యతిరేకత, ఇతర సమస్యల కారణంగా గత నాలుగేళ్లుగా ఈ విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఐఓబీ, సీబీఐతో పాటు మరో రెండు పీఎసబీలను ఆర్థికంగా బలంగా ఉన్న ఇతర పీఎసబీల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు ఇప్పటికే వార్తలు వినిపిస్తున్నాయి. మరో ఐదేళ్లలో ప్రపంచంలోని టాప్-10 బ్యాంకుల్లో ఒకటిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇదే సదస్సులో ప్రసంగించిన ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చెప్పారు. గురువారం తమ బ్యాంకు షేర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ 10,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.86 లక్షల కోట్లు) చేరినట్టు ఆయన వెల్లడించారు. కాగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ పరిమితిని ప్రస్తుత 20 శాతం నుంచి 49 శాతానికి పెంచే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని ఆయన కోరారు. దీనివల్ల ప్రభుత్వ-ప్రైవేట్ బ్యాంకుల మ?ధ్య మరింత సమతుల్యత ఏర్పడుతుందన్నారు.ఆ పీఎసబీల ప్రైవేటీకరణతో దేశ ప్రయోజనాలకు, ఆర్థిక సమ్మిళితానికి ఎలాంటి ముప్పు లేదని ఇటీవల కేంద్ర ఆర్తిక మంత్రి సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. పీఎసబీలను ప్రైవేటీకరించడం ముమ్మాటికీ దేశ, సామాజిక ప్రయోజనాలకు ముప్పని బ్యాంకింగ్ ఉద్యోగులకు సంబంధించిన తొమ్మిది యూనియన్లకు ప్రాతినిధ్యం వహించే యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఒక ప్రకటన లో తెలిపింది. దీనివల్ల ఉద్యోగ భద్రతతో పాటు బ్యాంకుల్లోని ప్రజల సొమ్ముకూ ఎలాంటి భద్రత ఉండదని హెచ్చరించింది. ప్రైవేటీకరణ కంపెనీలకు మేలు చేస్తుందే తప్ప, ప్రజలకు కాదని స్పష్టం చేసింది. ప్రభుత్వాలు బ్యాంకింగ్ రంగాన్ని సామాజిక, రాజ్యాంగ బాధ్యతగా చూడాలే తప్ప, లాభాల కోసం చేసే వ్యాపారంగా చూడకూడదని యూఎఫ్‌బీయూ కోరింది. ఏ పీఎసబీని ప్రైవేటీకరించబోమని ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది.

# ధనవంతులు కావాలనుకుంటే..
# ఇవిగో సింపుల్ చిట్కాలు..



దేశంలో అత్యధిక శాతం మంది ప్రజలు మధ్య తరగతి జీవులే. ఉద్యోగంలో నెల నెల వచ్చే రాబడిలో ఎంతో కొంత దాచుకోవాలని అనుకుంటారు. తీరా జీతం వచ్చాక.. ఇంటి అద్దె, పాలు, నిత్యావసర వస్తువు కొనుగోలు చేయడానికే అది సరిపోతుంది. ఇక పండగ వేళ ఏదో ఆఫర్ ఇస్తున్నారంటూ ఫ్రిజ్, బైక్ లేదా మరో వస్తువు కొనుగోలు చేస్తారు. అది కూడా ఈఎంఐ పెట్టి మరీ కొంటారు. దీంతో ప్రతి నెలా ఈఎంఐ కింద కొంత నగదు తప్పకుండా చెల్లించాల్సి వస్తుంది. దాంతో నెల మధ్యలోనే జేబు ఖాళీ అయిపోతుంది. ఇంట్లో అవసరాల కోసం అప్పుల వేట ప్రారంభమవుతుంది. మధ్య తరగతి జీవులు ప్రతి నెలా పడే పాట్లే ఇవి. అయితే దీని నుంచి బయట పడాలంటే.. జీతం పెరగకపోయినా పర్వాలేదు. కానీ, కొన్ని అలవాట్లు మార్చుకోవాలని ఆర్థిక రంగ నిపుణులు సూచిస్తున్నారు. ఆ అలవాట్లను మార్చుకుంటే.. ధనవంతులుగా మారతారని వారు స్పష్టం చేస్తున్నారు. మరి మార్చుకోవాల్సిన అలవాట్లు ఏంటి.. నిపుణులు ఏం చెబుతున్నారనేది ఇప్పుడు తెలుసుకుందాం.. ఈ మధ్యకాలంలో క్రెడిట్ కార్డులు వినియోగం భారీగా పెరిగిపోయింది. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు తమ అవసరాలను తీర్చుకోవడానికి, తమకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేయడానికి క్రెడిట్ కార్డులు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. క్రెడిట్ మొత్తాన్ని ఈఎంఐగా మార్చుకుని కట్టేస్తున్నారు. దీంతో నెలవారీ ఖర్చుల భారం భారీగా పెరిగిపోతుంది. ఇలా క్రెడిట్ కార్డులను విచ్చలవిడిగా వినియోగించడం, అప్పులు చేయడం వల్ల ఆర్థికంగా కుదేలవుతారని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. సంపాదనంతా అప్పులు తీర్చేందుకే సరిపోతుందని.. పొదుపు చేయడం కష్టతరం అవుతుందంటున్నారు. అత్యవసర నిధి ఉండాలి. ఎప్పుడైనా అనారోగ్య సమస్య తలెత్తవచ్చు. లేదా ఉద్యోగం కోల్పోవచ్చు. అలాంటి సమయంలో ఈ అత్యవసర నిధి కీలకంగా మారుతుంది. అయితే, కొందరి వద్ద అత్యవసర నిధి ఉండదు. దీంతో అవసరమైనప్పుడు అప్పుల కోసం చూస్తుంటారు. తెలిసిన వారిని, తెలియని వారిని అప్పులు అడుగుతుంటారు. మరి అప్పు దొరుకుతుందా అంటే కష్టమే అని చెప్పాలి. పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటాయో చెప్పలేం. అందుకే.. ముందు చూపుతో వ్యవహరిస్తూ కనీసం 6 నెలల ఖర్చులకు సంబంధించిన డబ్బును ఆదా చేసుకోవడం ఉత్తమమైన మార్గం. లేదంటే.. అత్యవసర సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మరికొందరు ప్రజలు.. ఇతరులతో పోల్చుకుంటూ సమస్యలను ఏరికోరి తెచ్చుకుంటారు. తమ పొరుగువారికి కారు ఉంటే.. మనకు కూడా ఆ వాహనం ఉండాలనుకుంటారు. ఆ క్రమంలో హోదా కోసం కార్లు, ఖరీదైన గాడ్జెట్‌లను కొనుగోలు చేస్తారు. సరిపడా డబ్బు, ఆదాయం లేకపోయినా రుణాలు తీసుకుని మరీ నచ్చినవి కొనుగోలు చేస్తుంటారు. దీని ఫలితంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుపోతారు. ఇంకేముంది.. ఆందోళన, ఒత్తిడి సదరు వ్యక్తుల జీవితంలో భాగమైపోతుంది. అందుకే.. గొప్పలకు పోవద్దని, ఉన్నదాంట్లో సర్దుకుని జీవించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇక ఎందులో అయినా పెట్టుబడి పెట్టేటప్పుడు ముందస్తు ప్లాన్ అనేది ఉండదు. క్రిప్టో, స్టాక్ ఎక్స్చేంజ్ఇ అంటూ బ్బడిముబ్బడిగా ఎందులోపడితే అందులో పెట్టుబడులు పెట్టేస్తుంటారు. కనీస అవగాహన, ప్లాన్ లేకుండా పెట్టుబడులు పెట్టడం వల్ల తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. అందుకే.. పెట్టుబడులు పెట్టేముందు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని ఫైనాన్షియల్ ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. ఎందులో పెట్టుబడి పెడితే ప్రయోజనం కలుగుతుందో, లాభాలు వస్తాయో పరిశీలించాలి. ఆ తరువాత పెట్టబడులు పెట్టాలని హితవు చెబుతున్నారు. మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఎస్ఐపీలలో ఇన్వెస్ట్‌మెంట్ల గురించి తెలుసుకుని ఇన్వెస్ట్ చేస్తే మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందని అంటున్నారు. మొత్తం మీద మధ్యతరగతి ప్రజలు.. వచ్చిన జీతాన్ని చాలా జాగ్రత్తగా ఖర్చు చేయాలి. అంటే.. తొలుత చిన్న చిన్న అప్పులు ఉంటే వాటిని తీర్చేయాలి. ఆ తర్వాత ఇంటికి కావాల్సిన సరుకులు తెచ్చుకోవాలి. ఇక మిగిలిన నగదులో కొంత సొమ్ము బ్యాంక్ లేదా పోస్టాఫీసుల్లో నెలనెల దాచుకోవాలి. ఏ రోజు ఏ అనారోగ్యం మనల్ని చుట్టు ముడుతుందో తెలియదు. ఈ నేపథ్యంలో పదో పరకో దాచుకోవాలి. ఒక వేళ అత్యవసరమై అప్పు తీసుకోవాల్సి వస్తే మాత్రం తొలుత జీవిత భాగస్వామితో చర్చించి ఒక నిర్ణయానికి రావాలి. ఆ తర్వాత ముందుకు అడుగు వేయాలి. అప్పుగా తీసుకున్న నగదు.. చాలా జాగ్రత్తగా ఖర్చు చేయాలి. ఇలా ఒక పద్దతి ప్రకారం ముందుకు వెళితే మధ్య తరగతి వారు సైతం సంపన్న వర్గం జాబితాలో చేరేందుకు ఎక్కువ సమయం పట్టదని నిపుణులు చెబుతున్న మాట.

# వాళ్లు కొంటున్న బంగారం చూస్తే అబ్బురపడాల్సిందే..



బంగారం ధరలు ఇటీవలి కాలంలో చుక్కలనంటుతున్నాయి కదా.. దీనికి ప్రధాన కారణం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ మేలిమి బంగారం ధర 4379 డాలర్ల స్థాయికి చేరడం. ఇక దేశంలో10 గ్రాముల బంగారం ధర 1.32 లక్షలకు చేరింది. ఎందుకిలా బంగారం ధర పైపైకి పోతోంది అన్నది తెలుసుకోవాల్సిన అవసరం ప్రతీ వినియోగదారుని మీదా ఉంది. దేశంలో బంగారం ధర బాగా పెరిగిపోవడానికి ఒక కారణం పండుగల సీజన్ అయితే, మెయిన్ రీజన్.. వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారం కొనడం.

ఈ ఏడాది 2025, సెప్టెంబర్ నెలలోనూ వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు భారీగానే బంగారం కొన్నాయి.

### రోజుకు రూ. 200 మీది కాదనుకుంటే..
## లక్షన్నర మీ సొంతం.. ఎలాగంటే..



ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరు భవిష్యత్తు అవసరాల కోసం నగదు పొదుపు చేస్తున్నారు. నగదు పొదుపు చేసేందుకు బ్యాంకుల్లో అనేక పథకాలు ఉన్నా.. చాలా మంది పోస్టాఫీస్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇందులో నగదు పెడితే ఎక్కడికి పోదనే ఒక నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. నగదు పొదుపు కోసం పోస్టాఫీస్‌ల్లో చాలా పథకాలు ఉన్నాయి. అందులో ఒకటి ఆర్డీ.. అంటే రికరింగ్ డిపాజిట్ పథకం. కేవలం రోజుకు రూ. 200 కడితే.. నెలకు రూ. 6 వేలు అవుతుంది. అలా రెండేళ్లు కట్టాలి. మొత్తం రూ.1,44000 అవుతుంది. దీనికి 6.7 శాతం వడ్డి అదిస్తుంది. అంటే రూ.10,112 వస్తుంది. అంటే రెండేళ్ల తర్వాత మొత్తం రూ. 1,54112 వస్తుంది. ఒక వేళ.. మీకు అత్యవసరంగా నగదు అవసరమైతే.. మీ మొత్తం డిపాజిట్‌లో 50 శాతం వరకు రుణం పొందవచ్చు. ఇక పోస్టాఫీస్‌లో ఆర్డీ కట్టేందుకు ఏడాది, రెండేళ్లు, మూడేళ్లు, ఐదేళ్లు కాల పరిమితి ఉంటుంది. మనం ఎన్నేళ్లకు నగదు కడితే అందుకు తగ్గట్టుగా వడ్డీ వస్తుంది. ఉదాహరణకు.. ఐదేళ్లకు ఆర్డీ కడితే..60 నెలల తర్వాత తీసుకోవచ్చు. అలా కాకుండా దానిని మరో ఐదేళ్ల వరకు పెంచుకునే వెలుసుబాటు ఉంది. దీంతో అధిక వడ్డీ వస్తుంది. అలా లక్షాధికారిగా సులువుగా కావచ్చు. అయితే 18 సంవత్సరాల వయస్సు ఉన్నవారు.. ఈ ఆర్డీ ఒపెన్ చేసేందుకు అర్హులు. ఏ పోస్టాఫీస్‌లో అయినా ఈ ఖాతా తెరవవచ్చు. ఒక వేళ పిల్లలు మైనర్లు అయితే.. పిల్లల పేరు మీద వారి తల్లిదండ్రులు ఖాతా తెరవవచ్చు. ఇది నమ్మకమైన పొదుపునకు సులువైన మార్గం.


## రోజుకు రూ.6తో నుంచి రూ. 40 లక్షల లబ్ధి పొందవచ్చని మీకు తెలుసా?




రోజుకు కేవలం ఆరు రూపాయల కంటే తక్కువ.. రూ.5.48 ఖర్చుపెట్టండి. అదే మీకు ఆపదలో ఎంతో అండగా నిలుస్తుంది. మీ ఎస్బీఐ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ ద్వారానే రోజుకు ఈ మొత్తాన్ని చెల్లించి రూ.40 లక్షల బెనిఫిట్ పొందవచ్చు. ఈ పాలసీ పొందడానికి ఖాతాదారుడు ఏడాదికి రూ.2000 ప్రీమియం చెల్లించాలి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు ఈ సౌకర్యాన్ని అందిస్తోంది.

మీరు ఏడాదికి రెండు వేలు చెల్లిస్తే, రూ. 40 లక్షలు, ఏడాదికి వెయ్యి చెల్లిస్తే రూ. 20 లక్షలు, లేదూ.. ఏడాదికి వంద రూపాయలు మాత్రమే చెల్లిస్తే, రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుంది.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ అనుబంధ సంస్థ అయిన, ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ భాగస్వామ్యంతో తమ ఖాతాదారులకు సమగ్రమైన, చౌకైన ఈ వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీని అందిస్తోంది. ఇది అనుకోని ప్రమాదాల బారిన పడ్డప్పుడు ఎంతో ఊరటనిస్తుంది.రోడ్డు, విద్యుత్తు ప్రమాదాలు, వరదలు, భూకంపాల వంటి ప్రకృతి విపత్తులు.. యాక్సిడెంట్స్, పాముకాటు వంటి కారణాలతో మరణించినా బాధితుడు సూచించిన నామినీకి రూ.40 లక్షలు, ఎస్‌బీఐ అందిస్తుంది. నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. 18 ఏళ్ల వయసు నుంచి 65 ఏళ్ల వయసు లోపు వారికి అర్హత ఉంటుంది. ఈ తరహా స్కీమ్స్ ఇతర బ్యాంకులు కూడా తమ ఖాతాదారులకు అందిస్తున్నాయి. హెల్త్ పరంగానే కాదు, ఇతర రంగాలకు కూడా తక్కువ ప్రీమియంతో ఎస్బీఐ ఇన్స్యూరెన్స్ సదుపాయం కల్పిస్తోంది.

## అధిక ఫ్యాట్ పాలు తాగితే గుండె ఆరోగ్యం పాడవుతుందా.. నిజాలు తేల్చేసిన నిపుణులు..



పాలు, పాల ఉత్పత్తులు ఎంత ముఖ్యమైనవో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. క్యాల్షియం, ప్రోటీన్లు, విటమిన్లు సహా శరీరానికి కావాల్సిన అనేక పోషకాలు వీటి నుంచి లభిస్తాయి. ముఖ్యంగా చిన్న పిల్లల ఎదుగుదలకు పాలు ఎంతగానో తోడ్పడతాయి. అయితే, చాలా మందిని ఓ భయం ఏళ్ల తరబడి నుంచి వెంటాడుతోంది. అధికంగా ఫ్యాట్ ఉన్న పాలు తాగితే దమనుల్లో కొవ్వు పేరుకుపోయి గుండె సంబంధిత సమస్యలు వస్తాయని ఆందోళనకు గురవుతుంటారు. అయితే, ఇందులో ఎంతవరకు నిజముందనే విషయాలను పరిశోధకులు తేల్చేశారు. తాజాగా జరిగిన అధ్యయనంలో దీనికి సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పాలు, పాల ఉత్పత్తులు వినియోగించే వారిపై కార్డియా ఓ అధ్యయనం చేసింది. యుక్త వయస్సులో ఉన్నవారు పాలు, పాల ఉత్పత్తులు వినియోగించినప్పుడు వారి గుండె ధమనుల్లో కాల్షియం పేరుకుపోవడానికి గల సంబంధాన్ని సైంటిస్టులు పరిశోధించారు. ఎందుకంటే దమనుల్లో క్యాల్షియం పేరుకుపోవడం అనేది గుండె సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. అయితే, ఫుల్ ప్యాట్ పాలు గుండెకు ఎలాంటి నష్టం కలిగించకపోగా దమనుల్లో కాల్షియం పెరుకుపోకుండా కొంతమేర రక్షణ కల్పిస్తుందని తేల్చారు. 1980 దశకం నుంచి 3 వేల మందికి పైగా వ్యక్తు లను ఈ పరిశోధనలో భాగం చేశారు. దాదాపు 25 ఏళ్లపాటు వారిపై అధ్యయనం చేశారు. ప్రయోగంలో పాల్గొన్న 3,110 మందిలో కేవలం 904 మందిలోనే క్యాల్షియం పేరుకుపోయినట్లు గుర్తించారు. ఆ తర్వాత పరిశోధకులు మరింతగా అధ్యయనం చేసి వారి ఆహారపు అలవాట్లను పరిశీలించగా.. ఫుల్ ఫ్యాట్ పాలు, పాల ఉత్పత్తులు తీసుకున్న వారిని దమనుల్లో క్యాల్షియం అతి తక్కువగా పేరుకుపోయిందని గుర్తించారు. దీంతో తక్కువ ఫ్యాట్ కలిగిన పాలు, పాల ఉత్పత్తులు వాడిన వారితే పోలిస్తే ఎక్కువగా ఫ్యాట్ ఉన్న పాలు, పెరుగు, చీజ్ వంటివి వాడిని వారిలో నష్టం తక్కువగా ఉందని తేల్చారు. అయితే, ఫుల్ ఫ్యాట్ పాలు తాగడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందని ఈ అధ్యయనం నిరూపించలేదని పరిశోధకులు చెబుతున్నారు. ఈ అధ్యయనం కేవలం ఫ్యాట్ పాలు, పాల ఉత్పత్తులు వినియోగించే వారి దమనుల్లో పేరుకుపోయే క్యాల్షియం గురించి మాత్రమే వివరిస్తుందని అంటున్నారు. ఆహారపు అలవాట్లు, వ్యాయామం, జన్య సంబంధ అంశాలు గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని సూచిస్తున్నారు. సమతుల్య ఆహారంతో పాటు పాల ఉత్పత్తులు తీసుకోవాలే కానీ అధికంగా వాటిని వియోగించమూ మంచిది కాదని చెబుతున్నారు.



## వారిని చూసి కన్నీళ్లొచ్చాయి

'నా కెరీర్ ఓ మ్యాజిక్‌లా అనిపిస్తుంది. ఒకటి తర్వాత ఒకటి అనుకోని వరాలే నన్ను వరించాయి' అంటూ తన కెరీర్‌ని మననం చేసుకున్నది పాలబుగ్గల వయ్యారి సారా అర్జున్. 'ఊహ తెలిసిన నాటినుంచీ మణిరత్నంసార్ సినిమాలంటే ఇష్టం. ఆయన దర్శకత్వంలో నటించాలని కలలు కనేదాన్ని. ఆ కల 'పొన్నియిన్ సెల్వన్'తో నెరవేరింది. ఆ తర్వాత నటనలో మెళకువలు నేర్చుకునేందుకు విదేశాలని వెళ్లాలనుకున్నాను. అంతలోని 'యుఫోరియా' అవకాశం వరించింది. ప్రస్తుత సమాజానికి అవసరమైన అరుదైన కథ కావడంతో అంగీకరించా. దీని షూటింగ్ టైమ్‌లోనే 'ధురంధర్'కు సైన్ చేశాను. 'ధురంధర్' విజయం నా కెరీర్‌నే సమూలంగా మార్చేసింది. ఆ సినిమా చూసి అమ్మానాన్న భావోద్వేగానికి లోనయ్యారు. వారి ఎమోషన్ చూసి నాకు కన్నీళ్లొచ్చాయి. ఇలా అనుకోకుండా ఆశలన్నీ నెరవేరడం మ్యాజిక్ కాక మరేంటి?' అన్నారు సారా అర్జున్.

### రజనీకాంత్ - కమల్ హాసన్ మల్టీస్టారర్‌పై

## మళ్లీ ఊపందుకున్న టాక్..



ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన పాన్ ఇండియా చిత్రాలు, సీక్వెల్స్, ప్రీక్వెల్స్ హవా కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా టాప్ స్టార్స్ కలిసి కనిపిస్తే ఆ సినిమా రిలీజ్‌కు ముందే భారీ హైప్ క్రియేట్ అవుతోంది. అలాంటి క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా గత కొన్నాళ్ల క్రితం ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి కనిపించే ఒక ప్రాజెక్ట్ కమల్ హాసన్ నిర్మాణంలో ఉందన్న వార్తలు ఉన్నప్పటికీ, అది కాకుండా మరోసారి వీరి కలయికలో కొత్త సినిమా రాబోతుందన్న ప్రచారం ఇప్పుడు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్టు స్ట్రాంగ్ టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చేలా, నెల్సన్ ఇప్పటికే రజినీకాంత్ -- కమల్ హాసన్ కలయికపై ఒక అనౌన్స్మెంట్ కట్ లేదా కాన్సెప్ట్ వీడియో తరహా విజువల్‌ను సిద్ధం చేస్తున్నాడన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువగా ఉందని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ 'జైలర్ 2'తో పాటు ఇతర కమిట్‌మెంట్స్‌లో బిజీగా ఉండగా, తెలుగులో కూడా ఒక సినిమా చేయాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాతే ఈ భారీ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాకుండా ఒక చరిత్రగా నిలుస్తుందన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది. అయితే ప్రస్తుతం ఇవన్నీ కేవలం రూమర్స్‌గానే ఉండగా, ఇందులో ఎంతవరకు నిజం ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

## తిరువీర్ 'భగవంతుడు' టీజర్ విడుదల




టాలీవుడ్ యువ నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'భగవంతుడు'. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పల్నాడు నేపథ్యంలో ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా చిత్ర యూనిట్ టీజర్‌ను విడుదల చేసింది. పల్లెటూరి నేపథ్యంలో సాగే పీరియడ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం టీజర్‌లో చూపించిన విజువల్స్ మరియు తిరువీర్ పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ సినిమాపై భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. మసూద, ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో వంటి చిత్రాలతో నటుడిగా తన సత్తా చాటిన తిరువీర్ ఇందులో మరో విభిన్నమైన మరియు భావోద్వేగపూరితమైన పాత్రలో కనిపించబోతున్నాడు. జీజీ విహారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రవి పనస ఫిల్మ్ కార్పోరేషన్ బ్యానర్‌పై రవి పనస నిర్మిస్తుండగా ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తోంది. రిషి నాగరాజు, కాలకేయ ప్రభాకర్, రవీంద్ర విజయ్, మురళిధర్ గౌడ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం తెలుగుతో పాటు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది.

## రషా తడానీ టాలీవుడ్ ఎంట్రీ

హిందీ చిత్రం 'ఆజాద్'లో 'ఉయ్ అమ్మ' అనే పాటతో బాగా పాపులర్ అయింది రషా తడానీ. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె అయిన ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం హిందీతో పాటు దక్షిణాదిలో కూడా అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నది. 'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో ఈ సొగసరి తెలుగులో అరంగేట్రం చేస్తున్నది. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. అశ్వినీదత్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి పి.కిరణ్ నిర్మాత. శుక్రవారం ఈ సినిమా నుంచి రషా తడానీ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఇందులో ఆమె సంప్రదాయ దుస్తుల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్నది. ఇటీవలే ఈ సినిమా రెండో షెడ్యూల్‌ని మొదలుపెట్టామని, చక్కటి కుటుంబ కథగా మెప్పిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జయకృష్ణ, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, రచన-దర్శకత్వం: అజయ్ భూపతి.

